టోల్‌ప్లాజా ప్రారంభంపై ఉద్రిక్తత

- హైవేపై రుద్రవరం గ్రామస్తుల ధర్నా
- రహదారి పూర్తి చేసి టోల్ వసూలు చేయాలని డిమాండ్
- రెవెన్యూ శాఖపై నెపంనెట్టిన హైవే అధికారులు
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన సమస్య



టోల్‌ప్లాజా వద్ద రోడ్డు పై బైఠాయించిన గ్రామస్తులు



ప్రజలు రోడ్డుపై బైఠాయించడంతో నిలిచిపోయిన వాహనాలు



ధర్నా చేస్తున్న ప్రజలతో మాట్లాడుతున్న ఎన్‌హెచ్ పీడీ, సీఐ

పాములపాడు: నేషనల్‌హైవే 340 సీ రహదారి పనులు పూర్తి కాక ముందే టోల్‌ప్లాజా ప్రారంభించి వాహనదారుల నుంచి టోల్ వసూలు చేయడంపై రుద్రవరం గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం హైవే అధికారులు ఆఘమేఘాలపై టోల్ ప్లాజా ప్రారంభించారు. విషయం తెలుసుకున్న సర్పంచు రామస్వామి, ఎంపీటీసీ సభ్యురాలు అరుణ, మాజీ సర్పంచు రామసుబ్బయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు రామేశ్వరీ ప్రజలతో కలిసి టోల్ ప్లాజా వద్ద ధర్నా చేపట్టారు. సుమారు 2 గంటల పాటు వాహనాలు నిలిచిపోయాయి. నేషనల్ హైవే పీడీ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. పీడీ వచ్చి సమాధానం చెప్పాలని పట్టుబట్టారు. ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ సురేష్‌బాబు టోల్ ప్లాజా వద్దకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

పనులు పూర్తి కాకుండానే టోల్ ప్లాజాను ఎలా ప్రారంభిస్తారు

నేషనల్ హైవే నిర్మాణంలో ఉండగా టోల్ ప్లాజా ప్రారంభించి వాహనచాదకుల నుంచి టోల్ ఎలా వసూలు చేస్తారంటూ ప్రజలు ప్రశ్నించారు. రుద్రవరం గ్రామంలో సర్వీసు రోడ్డు పూర్తి చేయలేదని, బస్సులు అండర్‌పాస్ వంతెనపై నుంచే వెళ్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అరకొరగా సర్వీసు రోడ్డు నిర్మాణం చేపడితే వాహనాలు ఎలా వెళ్తాయని, అనాలోచితంగా పనులు ఎలా చేస్తారని అక్కడికి చేరుకున్న పీడీ పద్మను పలువురు ప్రశ్నించారు. అలైన్‌మెంట్ ప్రకారం కాకుండా ఇష్టానుసారంగా స్థల సేకరణ చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. టోల్ ప్లాజాలో స్థానికులకు విస్మరించి, స్థానికేతరులకు ఉద్యోగాలు ఎలా ఇస్తారని నిలదీశారు. స్థానిక ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా గోప్యంగా ప్రారంభించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నలు సంధించారు. కాగా రెవెన్యూశాఖ అధికారులు స్థలం చూపిస్తే సర్వీసు రోడ్డు పనులు చేస్తామని ఆమె రెవెన్యూశాఖపై నెపం నెట్టారు. రోడ్డు నిర్మాణ పనులు అలైన్‌మెంట్ ప్రకారం చేపట్టకపోవడంతో గ్రామంలోకి స్కూల్ బస్సులు, లారీల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉందని గ్రామస్తులు ఆరోపించారు. పరిహారం పొందిన వారి ఇళ్లను కూల్చి రహదారి క్లియర్ చేయాలని డిమాండ్‌చేశారు. సీఐ, ఎస్ఐలు ప్రజలతో మాట్లాడి సర్ది చెప్పారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించారు.

క్లుప్తంగా

సన్మానం



బదిలీ అయిన ఉస్మాన్‌బాషా, అనురాధలను సన్మానిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు

జూపాడుబంగ్లా: మండలంలోని తాటిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఉస్మాన్‌బాషా, అనురాధ బదిలీపై వెళ్తుండటంతో శుక్రవారం ఎంఈఓలు, ఉపాధ్యాయులు సన్మానించారు. ఉపాధ్యాయులకు బదిలీలు సర్వసాధారణమని, ఎక్కడికి వెళ్లినా అంకితభావంతో విద్యార్థులకు మంచి విద్యాబుద్ధులు నేర్పాలని ఎంఈఓలు చిన్నమద్దిలేటి, శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం డేవిడ్ రవిశేఖర్, సతీష్‌చంద్ర, సతీష్‌కుమార్, భాగ్యమ్మ, జరీనాపర్వీన్, శ్రీలత, రమేష్ పాల్గొన్నారు.

భ్రమరాంబాదేవికి ఊయలసేవ



స్వామి అమ్మ వార్లకు ఊయల సేవ నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: అష్టా దశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం సందర్భంగా దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. సాయంత్రం 7గంటలకు సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసిషోడశోపచార పూజల అనంతరం అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. అనంతరం అంకాలమ్మ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బొలేరో – ఆటో ఢీ



బోల్తా పడిన ఆటో

మహానంది: బుక్కాపురం గ్రామం వద్ద శుక్రవారం ఆటో – బొలేరో వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆటోలో ఉన్న వారికి స్వల్ప గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. వారిని చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు.

సీఎస్ఆర్ఎంఓగా డాక్టర్ పద్మజ



డాక్టర్ వి.పద్మజ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నూతన సివిల్ సర్జన్ ఆర్ఎంఓ (సీఎస్ఆర్ ఎంఓ)గా డాక్టర్ వి.పద్మజ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన డిప్యూటీ సివిల్ సర్జన్ కేడర్‌పై పదోన్నతిలో భాగంగా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓగా పనిచేస్తున్న డాక్టర్ పి.పద్మజను పదోన్నతిపై కర్నూలుకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి మెరుగైన వైద్యసేవలు అందించడమే తన ప్రధాన లక్ష్యమని, వైద్య సిబ్బంది సహకారంతో ఆసుపత్రి సేవల స్థాయిని మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఆమెను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, వైద్యులు, అధికారులు, సిబ్బంది అభినందించారు.

గోల్డెన్ అవర్‌లో ఆసుపత్రికి తరలించాలి

కర్నూలు(హాస్పిటల్): రోడ్డు ప్రమాదానికి గురైన వ్యక్తిని గోల్డెన్ అవర్ (మొదటి గంట)లో ట్రామా సౌకర్యాలున్న ఆసుపత్రికి తరలిస్తే ప్రాణాలు కాపాడేందుకు అవకాశం ఉంటుందని న్యూరోసర్జన్ డాక్టర్ విశ్వకుమార్, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ మంజునాథ్ చెప్పారు. ప్రపంచ ట్రామా దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం స్థానిక మెడికవర్ హాస్పిటల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా ఏటా 5 కోట్ల మంది రోడ్డు ప్రమాదాల్లో గాయపడుతున్నారని, అందులో 50 లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారని వివరించారు. దేశంలో నాలుగు నిమిషాలకో వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన గంటలోపు సరైన చికిత్స అందించగలిగితే కాపాడే అవకాశాలు 80 శాతం వరకు పెరుగుతాయని చెప్పారు. క్లస్టర్ హెడ్ మహేశ్వరరెడ్డి, ఎమర్జెన్సీ మెడిసిన్ స్పెషలిస్టు డాక్టర్ సునీల్, న్యూరోఫిజీషియన్ డాక్టర్ రఘునందిని, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులను ఆకట్టుకునేలా అలంకరణ పనులు చేయాలి



సీల్డు టెండర్లు నిర్వహిస్తున్న ఈఓ, ఏఈఓలు

మహానంది: కార్తీక మాసం సందర్భంగా విద్యుద్దీపాలంకరణ పనులు భక్తులను ఆకట్టుకునేలా చేయాలని మహానంది ఈఓ నల్లకాలువ శ్రీనివాస రెడ్డి అన్నారు. కార్తీక మాసం పురస్కరించుకుని విద్యుత్ అలంకరణ పనులకు సంబంధించి శుక్రవారం సీల్డు టెండర్లు నిర్వహించారు. నలుగురు సీల్డు టెండర్లు దాఖలు చేయగా కోవెలకుంట్లకు చెందిన శ్రీ వీరభద్ర సప్లయర్స్ వారు రూ.2.90 లక్షలతో విద్యుత్ అలంకరణ పనులను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఈఓ నల్లకాలువ శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ నిబంధనల ప్రకారం పనులు చేయాలని కోరారు. పడిపోయిన చింత చెట్లు, పాత రేకు డబ్బాలకు సంబంధించి వేలాలు వాయిదా పడ్డాయి. కార్యక్రమంలో ఏఈఓ ఎరమల మధు, సూపరింటెండెంట్లు అంబటి శశిధర్ రెడ్డి, ఎం.నీలకంఠేశ్వర రాజు, పి.సుబ్బారెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆయిల్ పామ్‌తో రైతులకు లాభాలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యాన అధికారి బి.హరీంద్ర

బండి ఆత్మకూరు: ఉద్యాన శాఖ, పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మండలంలోని ఎర్రగుంట్ల గ్రామ రైతులకు శుక్రవారం ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉద్యాన అధికారి బి.హరీంద్ర రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ నీటి వసతి కలిగి ఉండి, ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు మొక్కలను ఉచితంగా అందిస్తామన్నారు. నాలుగేళ్ల నుంచే దిగుబడి ప్రారంభమై 25 ఏళ్ల వరకు కొనసాగుతుందన్నారు. నాలుగేళ్ల వరకు పంటకు అవసరమయ్యే ఎరువులకు ఏటా హెక్టారుకు రూ.10,500 చొప్పున ప్రభుత్వమే ఇస్తుందన్నారు. ప్రోత్సాహకం గా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్న రైతులు రైతు సేవా కేంద్రంలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పతంజలి జిల్లా మేనేజర్ ఎస్ రమణ, వ్యవసాయ విస్తరణ అధికారి అశోక్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

బండి ఆత్మకూరు: కార్మికులకు కనీస వేతనాలు అమలు చేసి, పని గంటలు తగ్గించాలని సీఐటీయూ రాష్ట్ర నాయకురాలు స్రవంతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పార్నపల్లె గ్రామంలో ఉన్న టీటీడీ కల్యాణ మండపంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సీఐటీయూ మూడవ మండల మహాసభలో ఆమె మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేసేలా పోరాటాలు చేసేందుకు కార్మికులందరు ఐక్యంగా ఉండాలని కోరారు. అనంతరం 15 మంది సభ్యులతో కూడిన మండల నూతన కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు ఏసురత్నం, సీనియర్ నాయకుడు తోట మద్దులు, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి డేవిడ్, రైతు సంఘం నాయకులు మదర్ వలి, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు వెంకటరమణ, వసంతమ్మ, ఆశా యూనియన్ నాయకురాలు భాగ్యమ్మ, సువర్ణమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ నాయకుడు నాగరాజు, వీఓఏల సంఘ నాయకుడు మునిస్వామి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న హృదయరాజు

నంద్యాల(న్యూటౌన్): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు గడిచినా ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు విమర్శించారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో నంద్యాల జిల్లా అధ్యక్షుడు మాధవస్వామి అధ్యక్షతన సమావేశం జరిగింది. ముఖ్యఅతిథులుగా హాజరైన హృదయరాజు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నగరి శ్రీనివాసులు, సాంబశివుడు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధ్యాయ, ఉద్యోగులకు సంబంధించిన ఆర్థిక బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. దీర్ఘకాలంగా ఉన్న నాలుగు డీఏలను చెల్లించకపోవడం, పీఆర్సీ నియమించకపోవడం, మధ్యంతర భృతి చెల్లించకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఫ్యాప్టో ఆధ్వర్యంలో 10వేల మంది ఉపాధ్యాయులతో ధర్నా చేసినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఉపాధ్యాయ ఉద్యోగులు మరో బీఆర్‌టీఎస్ ఉద్యమానికి సిద్ధం కాకముందే తక్షణమే డీఏలను ప్రకటించాలని, 30శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని కోరారు. నాయకులు పుల్లయ్య, రవి, మునిస్వామి, వెంకటేశ్వర్లు, రామాంజనేయులు పాల్గొన్నారు.

పీజీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు కల్చరల్: డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో 2025–26 విద్యా సంవత్సరంలో ఒక సంవత్సరం పీజీ కోర్సుల్లో లేటరల్ ఎంట్రీ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లోకనాథ ఒక ప్రకటనలో తెలిపారు. వర్సిటీలో నాలుగు సంవత్సరాల ఆనర్స్‌తో కూడిన యూజీ డిగ్రీ, ఒక సంవత్సరం పీజీ ప్రోగ్రాం (లేటర్ ఎంట్రీ)లో బీఎస్సీ/బీకాం/బీఏ/బీబీఏ/బీసీఏ ఆనర్స్ విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 25వ తేదీలోగా వర్సిటీలో దరఖాస్తులను సమర్పించాలని సూచించారు.

జీఎస్‌టీతో క్రీడా పరికరాల ధర తగ్గింపు



జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

నంద్యాల: జీఎస్‌టీ తగ్గింపుతో క్రీడా పరికరాల ధరలు 12 నుంచి 5 శాతం వరకు తగ్గాయని సెట్కూరు సీఈవో డాక్టర్ వేణుగోపాల్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా యువజన సంక్షేమ శాఖ – సెట్కూరు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్ కార్యక్రమంలో భాగంగా టాయ్స్, స్పోర్ట్స్ దుకాణాల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నూతన జీఎస్టీ స్లాబుల సవరణ వల్ల క్రీడా పరికరాలు ఇప్పుడు 5శాతం రేటు కిందకు వస్తాయని, దీంతో డబ్బు ఆదా అవుతుందన్నారు. నంద్యాల ఎంపీడీఓ సుగుణ శ్రీ మాట్లాడుతూ స్థానిక బొమ్మల సమూహాలు, క్రీడా వస్తువుల పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా ప్రభుత్వం 'మేక్ ఇన్ ఇండియా'' చొరవను బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. సెట్కూరు సూపరింటెండెంట్ శ్యాంబాబు, క్రీడా ప్రాధికార సంస్థ శిక్షకులు సుదర్శన్, కిశోర్ బాలరాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మహానంది: మహానంది మండలం గాజులపల్లె సబ్ స్టేషన్ పరిధిలో మాత్రమే శనివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో, 33 కేవీ లైన్ల విద్యుత్ పనుల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. రైతులకు నేటి రాత్రి నుంచి రేపు ఉదయం 9 గంటల వరకు త్రీ ఫేస్ సరఫరా ఉంటుందని చెప్పారు.

- బండి ఆత్మకూరు: నిర్వహణ పనులు చేపడుతుండటంతో బండిఆత్మకూరు, ఈర్నపాడు, సంతజూటూరు సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ కంబగిరి శుక్రవారం తెలిపారు. గృహ, వాణిజ్య వినియోగదారులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ కోత ఉంటుందన్నారు. వ్యవసాయ వినియోగదారులకు తెల్లవారుజామున 3 నుంచి ఉదయం 9 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

కొత్తపల్లి: ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను బాధితులకు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య శుక్రవారం పంపిణీ చేశారు. పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

పెయ్యదూడల సూదులపై అవగాహన కల్పించాలి

ఆత్మకూరు: పెయ్యదూడలు మాత్రమే పుట్టే సూదులపై అవగాహన కల్పించాలని పశుసంవర్ధక శాఖ ఇన్‌చార్జి సహాయక సంచాలకులు డాక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. శుక్రవారం కొత్తపల్లి, ఆత్మకూరు మండల పశువైద్య సిబ్బందితో కలిసి ఆత్మకూరు పశువైద్యశాలలో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. అంతకుముందు శ్రీపతిరావుపేట రైతుసేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు. పెయ్యదూడలు పుట్టేందుకు రూ.150కే సూదులు అందుబాటులో ఉన్నాయని, రైతులకు అవగాహన కల్పించి, ప్రభుత్వ లక్ష్యాలను సాధించాలన్నారు. అన్ని రకాల టీకాలు వంద శాతం పశువులకు వేయించి ఆరోగ్యకరమైన పాలు ఉత్పత్తి చేయాలన్నారు. స్థానిక రైతు మస్తాన్‌రావు చాఫ్ కట్టర్ వినియోగించడాన్ని పరిశీలించి గడ్డి వృథాను అరికట్టడానికి మిగతా రైతులు కూడా చాఫ్ కట్టర్‌ను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు అరుణ, అశోక్, భువనేశ్వరి పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసులపై సమాచారమివ్వండి

నంద్యాల(అర్బన్): పోలీసు స్టేషన్ల పరిధిలో 30 రోజుల క్రితం ఏవైనా మ్యాన్ మిస్సింగ్ కేసులు నమోదై ఉంటే నంద్యాల తాలూకా సీఐ ఈశ్వరయ్యకు తెలియజేయాలని నంద్యాల రూరల్ పోలీసులు కోరారు. ఇటీవల కుందూ నదిలో కొట్టుకొచ్చిన 35– 40ఏళ్ల మధ్య వయస్సు గల పురుషుడి అస్థిపంజరం నంద్యాల మండలం భీమవరం గ్రామ సమీపంలోని లభ్యమైందన్నారు. ఆ అస్థిపంజరం వివరాల కోసం పోలీసు స్టేషన్ల పరిధిలో మ్యాన్ మిస్సింగ్ కేసుల వివరాలను సెల్: 9121101092 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.

పాడిపశువుల యూనిట్లు మంజూరు



మాట్లాడుతున్న పశుసంవర్ధకశాఖ ఏడీఏ నాగరాజు

డోన్: డీఆర్‌డీఏ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని పొదుపులక్ష్మి మహిళలకు పాడిపశువులు, గొర్రెలు, మేకల యూనిట్లను అందజేయడానికి ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేసిందని పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకుడు డాక్టర్ నాగరాజు తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో డీఆర్‌డీఏ ప్రణాళిక అధికారి కరుణ, పశుసంవర్ధక శాఖ సంచాలకుడు దామోదర్ నాయుడు ఆదేశాల మేరకు మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పశువైద్య అధికారి డాక్టర్‌పద్మావతి, డాక్టర్ భాను, నవ్య, పాల్గొన్నారు.

బైకిస్ట్‌పై కేసు నమోదు

జూపాడుబంగ్లా: అతివేగంగా బైక్ నడిపి బాలుడిని ఢీకొన్న వ్యక్తిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని తాటిపాడు గ్రామానికి చెందిన ఐదేళ్ల బాలుడు ఉస్మాన్ బాషాను అదే గ్రామానికి చెందిన అశోక్ మూడురోజుల క్రితం బైక్‌తో ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన బాలుడిని కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. బాలుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అశోక్‌పై కేసు నమోదు చేసి, అతడి ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కులం పేరుతో దూషించారని ఫిర్యాదు

నందికొట్కూరు: మిడుతూరు మండలం జలకనూర్‌లో గ్రామంలోని ప్రార్థనా మందిరానికి వెళ్లిన దళితుడు ధనరాజ్‌ను నిర్వాహకులు అడ్డుకున్న సంఘటన శుక్రవారం జరిగింది. అంతేకాకుండా కులం పేరుతో దూషించారని పోలీసు స్టేషన్‌లో ఏఎస్ఐ సుబ్బయ్యకు దళితుడు ఫిర్యాదు చేశారు. ప్రార్థనా మందిరంలోకి రాకూడదని మెడపట్టి గెంటేశారని, విచారణ జరిపి న్యాయం చేయాలని బాధితుడు పోలీసులను కోరారు. మొక్కుబడి తీర్చుకునే అవకాశం లేకుండా పోయిందని దళితుడు పోలీసుల ఎదుట వాపోయారు.



నిరసన గళం

సాక్షిపై కూటమి ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలను సీనియర్ జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాలు, ప్రజా సంఘాలు ఖండించాయి. సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డి, వివిధ జిల్లాల రిపోర్టర్లపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కోరుతూ శుక్రవారం నందికొట్కూరులో ధర్నా నిర్వహించి డిప్యూటీ తహసీల్దార్ సోమేశ్వరిదేవికి వినతి పత్రం అందజేశారు.

సుప్రీంకోర్టు సీజేఐపై దాడి తగదు



పాములపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



ఆత్మకూరులో అధికారికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు

సాక్షి నెట్‌వర్క్: సుప్రీంకోర్టు సీజేఐ బీఆర్ గవాయిపై దాడిని ఎమ్మార్పీఎస్ ఖండించింది. శుక్రవారం పాములపాడు, ఆత్మకూరు, వెలుగోడు, బండిఆత్మకూరు, శ్రీశైలంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహించారు. పాములపాడులో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ ప్రేమరాజు, మండల అధ్యక్షుడు మోహన్, ఆత్మకూరులో నాయకులు భాషపోగుల దరగయ్య, కాటేపోగు నాగయ్య, బండి ఆత్మకూరులో పూల వెంకట సుబ్బన్న, నాగన్న మాదిగ, తిరుపతి మాదిగ, వెలుగోడులో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వాదం నాగశేషులు, శ్రీశైలంప్రాజెక్ట్ కాలనీలో నాయకులు రమేష్, యోహాన్ ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహించారు. సీజేఐపై దాడికి యత్నించిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.



విద్యుద్దీపాలు ఏర్పాటుచేయని తాటిపాడు అండర్ పాస్ వంతెన

చీకట్లో అండర్‌పాస్ వంతెన

జూపాడుబంగ్లా: తాటిపాడు గ్రామ సమీపంలో ఏర్పాటుచేసిన ఎన్‌హెచ్ 340సీ రోడ్డు అండర్ పాస్ వంతెన కింద విద్యుత్‌దీపాలు ఏర్పాటుచేయకపోవటంతో తాటిపాడు గ్రామస్తులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. హైవే నిర్మాణంలో భాగంగా కేసీ కాల్వపై నిర్మించిన వంతెన వద్ద నుంచి తాటిపాడు అండర్‌పాస్ బ్రిడ్జి మీదుగా ఇసుకవాగు వరకు రోడ్డు వెంట కాంట్రాక్టర్లు విద్యుత్ దీపాలు ఏర్పాటుచేశారు. అండర్‌పాస్ వంతెన కింద మాత్రం విస్మరించారు. దీంతో రాత్రివేళల్లో వంతెన కింద చీకటిగా ఉంటోందని, రాకపోకలకు భయంగా ఉంటుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. హైవే నిర్మాణ పర్యవేక్షణాధికారులు స్పందించి విద్యుద్దీపాలు ఏర్పాటుచేయించాలని కోరుతున్నారు.